




# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)

Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 137 | బుధవారం 17 జూన్ 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695







# రైతులకు భారీ ఊరట

- నెలాఖరున రైతు భరోసా జమ
- అర్హుల జాబితా సిద్ధం
- ఎకరానికి రూ.6 వేల సాయం
- ఖమ్మం నుంచి ప్రారంభం?
- నిధుల విడుదలకే ఎదురుచూపు
- ఖరీఫ్‌కు పూర్తి సాయం
- కొత్త పట్టాదారులకు గుడ్‌న్యూస్
- 70 లక్షల రైతులకు లబ్ధి
- సాగు భూములకే ప్రాధాన్యం
- బీడు భూములకు చెక్
- చిన్న రైతులపై ఫోకస్
- కటాఫ్‌పై కసరత్తు
- పెండింగ్ సాయంపై ఆశలు
- యాసంగి విమర్శలకు చెక్?
- రైతు ఖాతాల్లోకి నేరుగా జమ



**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే వ్యవసాయ శాఖ నుంచి రైతుల వివరాలను సేకరించింది. కొత్తగా పట్టాలు పొందిన వారికి నోటిఫికేషన్ విడుదలైన వారం రోజుల్లోనే ఎకరానికి సాయం జమ చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత యాసంగి సీజన్‌లో ప్రభుత్వం రెండు విడతలుగా, ఒక్కొక్క రైతుకు గరిష్ఠంగా రెండెకరాల వరకు సాయం అందించింది. అయితే, మిగిలిన ఎకరాలకు సాయం అందుతుందని భావించిన రైతులకు నిరాశ ఎదురైంది. ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా పంట సాగు జరుగుతుండటంతో పూర్తి సాయం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు వ్యవసాయ శాఖ వెల్లడించింది. వానాకాలంలో పూర్తిగా సాగు జరుగుతుందని భావించి పట్టా ఉన్న ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి భరోసా పంపిణీ ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు సమాచారం.

**అర్హుల జాబితా రెడీ..**

పంట సీజన్ ప్రారంభమవడంతో రైతులు ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు తీసుకుంటున్నారని, వారికి ఇబ్బందులు లేకుండా సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇటీవల ఆర్థిక శాఖ ఈ అంశంపై సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. అర్హుల జాబితా సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదలైన వెంటనే ఎకరానికి రూ.6,000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ప్రతి సీజన్‌కు ప్రభుత్వం సుమారు రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. సాగు చేయని భూములను జాబితా నుంచి తొలగిస్తే సుమారు రూ.1,200 కోట్లు ఆదా అవుతాయని అంచనా. రాష్ట్రంలో 1.40 కోట్ల ఎకరాల భూమి ఉండగా, 70 లక్షల మంది రైతులకు పట్టా పాస్‌బుక్‌లు ఉన్నాయి. గతేడాది సాగు చేయని సుమారు 3.50లక్షల ఎకరాలను గుర్తించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, గ్రామ పరిసరాల్లోని భూములు, రోడ్లు, కాలువల కిందికి వెళ్లిన భూములు కలిపి సుమారు 2 లక్షల ఎకరాలు సాగుకు పనికిరావని తేల్చారు.

మిగతాది 2 లో..

# లీకేజీ డ్రామాలకు చెక్

## టెలిగ్రామ్ నిషేధంపై ఎన్టీఏ వివరణ




**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** దేశవ్యాప్తంగా జూన్ 21న జరగబోయే నీట్-యుజి రీ ఎగ్జామ్స్ పారదర్శకతను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక ఆంక్షలు విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జాతీయ పరీక్షల సంస్థ సిఫార్సుల మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఐటీ చట్టం సెక్షన్ 69ఏ కింద జూన్ 22 వరకు టెలిగ్రామ్ యాక్సెస్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది.

# బీఆర్ఎస్‌లో 'మావోయిస్టు' భావజాల నేతలున్నారు




**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** 'సర్' ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కావాలనే రాజకీయం చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా ఉన్న ఓట్లను అధికారులు తొలగిస్తే అందులో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి, రాజకీయ పరిణామాలపై ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ విపక్షాలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.


# 'నీట్' అభ్యర్థులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్




**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** వైద్య విద్యే లక్ష్యంగా ముందడుగు వేస్తున్న 'నీట్' అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అద్భుతమైన తీపి కబురు అందించింది. జూన్ 21న జరగబోయే నీట్ రీ ఎగ్జామ్ కు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.పరీక్షా కేంద్రాలకు వెళ్లే అభ్యర్థులు తమ వెంట కేవలం 'నీట్ హాల్ టికెట్' చూపిస్తే చాలు.. ఎలాంటి చార్జీలు లేకుండా ఉచితంగా ప్రయాణించవచ్చని స్పష్టం చేసింది.

# తెలంగాణకు ఎండల ముప్పు

## ఉత్తర జిల్లాలకు 'హీట్ వేవ్' అలర్ట్




**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణలో వాతావరణం మళ్లీ ఆందోళనకరంగా మారింది. ఆషాఢ మాసం ప్రవేశిస్తున్నా నైరుతి రుతుపవనాల గమనం మందకొడిగా సాగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఇంకా పూర్తి స్థాయిలో వర్షాలు విస్తరించలేదు. ఈ నేపథ్యంలో ఎండల తీవ్రత మళ్లీ పెరిగింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ఉత్తర తెలంగాణలోని 10 జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ శాఖ హీట్ వేవ్ హెచ్చరికలను జారీ చేసింది. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సరిసిల్ల జిల్లాలకు భారీగా వడగాల్పులు వీయనున్నాయి. ఆయా జిల్లాల్లో ఇప్పటికే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటి నమోదవుతున్నాయి.

# గుర్తింపు కార్డుగా ఆధార్ వినియోగం

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు




**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** దేశంలో ప్రతీపౌరుడు నేటివిటీ, బర్త్, వ్యక్తిగత గుర్తింపు కార్డుగా ఆధార్ కార్డును వాడుతున్న విషయం తెలిసిందే. ఆధార్ ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన కార్డుగా మారింది. అయితే యూఐడిఏఐ నుంచి పొందిన ఆధార్ కార్డుల్ని కొందరు పౌరసత్వం, స్థానికత, నివాస ధృవీకరణ పత్రాలుగా దుర్వినియోగం చేస్తున్నారని ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

# బిడ్డా జాగ్రత్త

## మావోయిస్టులందరూ మా పార్టీలోనే ఉన్నారు

## కవిత సెన్సేషనల్ కామెంట్స్




# గ్రామీణాభివృద్ధే లక్ష్యం

## పంచాయతీరాజ్ బలోపేతానికి కట్టుబడి ఉన్నాం

**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** 2019-24 మధ్య రూ.42,500 కోట్లతో 884 కి.మీ. సీసీ రోడ్లు మాత్రమే నిర్మాణం జరిగిందని, ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో రూ.16,700 కోట్లతో 7,000 కి.మీ. సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. గత ప్రభుత్వంలో 239 కి.మీ. బీటీ రోడ్లు పూర్తి చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వంలో 1,500 కి.మీ. పూర్తి చేశామన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా నేడు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి, కేంద్ర నిధుల వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతపురంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న వి.బి.జి రామ్‌జీ కార్యక్రమాన్ని ప్రారంభించాల్సిందిగా పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శివరాజ్ సింగ్ చౌహాన్.. జూలై 1వ తేదీన అనంతపురం పర్యటనకు వచ్చేందుకు అంగీకరించారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అపారమైన సహకారానికి, అత్యధిక నిధుల కేటాయింపునకు పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.



# గ్రామీణాభివృద్ధే లక్ష్యం.. పంచాయతీరాజ్ బలోపేతానికి కట్టుబడి ఉన్నాం

మొదటి పేజీ తరువాయి




ఈ సమావేశం అనంతరం పవన్ కళ్యాణ్ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రగతికి ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. గత 2019–24 మధ్య ఐదేళ్ల కాలంలో కేవలం 42,500 కోట్ల రూపాయల భారీ వ్యయంతో కేవలం 884 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం మాత్రమే జరిగిందని గుర్తుచేశారు. కానీ తమ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కేవలం 16,700 కోట్ల రూపాయలతోనే ఏకంగా 7,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణాన్ని విజయవంతంగా చేపట్టామని వెల్లడించారు. రోడ్ల నాణ్యత విషయంలోనూ గతంలో కేవలం 239 కిలోమీటర్ల బీటీ రోడ్లు పూర్తయితే, ప్రస్తుత ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో 1,500 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లను పూర్తి చేశామని స్పష్టం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి రంగాల్లో సాధించిన పురోగతిని పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వంలో గోశాలల నిర్మాణం పూర్తిగా శూన్యమని, అయితే తమ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా 15,000 యూనిట్ల గోశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. గతంలో కేవలం 564గా ఉన్న మినీ గోకులాల సంఖ్యను ఏకంగా 50,000 మినీ గోకులాల స్థాయికి పెంచి అద్భుతమైన ప్రగతి సాధించామన్నారు. ఇక ఉద్యానవన అభివృద్ధిలో కేవలం రెండేళ్లలోనే 2 లక్షల ఎకరాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టామని, ప్రతి సంవత్సరం మరో లక్ష ఎకరాల్లో ఉద్యానవన విస్తరణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వివరించారు. ఉపాధి హామీ పనుల్లో పారదర్శకతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఎన్‌రేగా కింద ఈ–కేవైసీ అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందన్నారు. నిధుల దుర్వినియోగానికి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అత్యాధునిక సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే వేలాది సామాజిక ఆడిట్లు, గ్రామ సభలు, ప్రజా విచారణలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థల బలోపేతానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, పల్లెల సమగ్ర వికాసమే ధ్యేయంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

# శాంతి ఒప్పందం.! పెట్రోల్ నుంచి హోం లోన్ వరకు.. భారతీయులకు ఎలాంటి ప్రభావం పడనుందంటే.!



**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** అమెరికా, ఇరాన్ మధ్య కుదరనున్న శాంతి ఒప్పందం ఒక సాధారణ దౌత్య పరిణామంలా కనిపించినా.. దాని ప్రభావం ప్రపంచంలోని ప్రతి వ్యక్తిపై, ముఖ్యంగా భారతీయుల రోజువారీ జీవితంపై దీని ప్రభావం మరింతగా ఉండనుంది. వంటగ్యాస్ ధరల నుంచి పెట్రోల్, డీజిల్ రేట్లు, విమాన టికెట్ల ఖర్చులు, ఆహార ధరలు, హోం లోన్ ఈఎంఐల వరకు అనేక అంశాలపై ఈ ఒప్పందం సానుకూల ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. ప్రతిపాదిత ఒప్పందంలో హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు 60 రోజుల కాల్పుల విరమణ పొడిగింపు, ఇరాన్‌పై ఆంక్షల సడలింపు, అణు చర్చల పునఃప్రారంభం వంటి కీలక అంశాలు ఉన్నాయి. ఈ వార్తలతో ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు 4%కి పైగా తగ్గాయి.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గనున్నాయా.?

ఈ ఒప్పందం వల్ల అత్యధికంగా లబ్ధి పొందే వారు వాహనదారులే. భారత్ తన ముడి చమురు అవసరాల్లో 85% కి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. అందులో ఎక్కువ భాగం గల్ఫ్ ప్రాంతం నుంచి వస్తుంది. అందులో అధికభాగం హోర్ముజ్ జలసంధి గుండా రవాణా అవుతుంది. ప్రపంచ చమురు వ్యాపారంలో దాదాపు 20% ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఉద్రిక్తతల కారణంగా చమురు ధరలు పెరగడంతో పాటు దిగుమతి వ్యయం కూడా పెరిగింది. అయితే హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడం, ఇరాన్ చమురు ఎగుమతులు పునరుద్ధరించే అవకాశం ఉండటంతో మార్కెట్లో సరఫరా పెరిగి ధరలు తగ్గే అవకాశముంది. దీంతో భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి తగ్గవచ్చు.

విమాన ప్రయాణాలు చౌకగా.?

విమానయాన సంస్థలకు ఇంధన వ్యయం అత్యంత కీలక ఖర్చులలో ఒకటి. ముడి చమురు ధరలు తగ్గితే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ధరలు కూడా తగ్గుతాయి. దీంతో విమానయాన సంస్థలు టికెట్ ధరలను తగ్గించడం లేదా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించే అవకాశం ఉంటుంది. దేశీయ విమాన ప్రయాణాలు వేగంగా పెరుగుతున్న ఈ సమయంలో, గల్ఫ్ దేశాలకు ప్రయాణించే భారతీయులు, యూరప్ మార్గాల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఇది శుభవార్తగా మారవచ్చు.

ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం:

చమురు ధరలు తగ్గడం వల్ల కేవలం ఇంధన ఖర్చులే కాదు.. ఆహార పదార్థాల ధరలపై కూడా ప్రభావం పడుతుంది. కూరగాయలు, పండ్లు రవాణా చేసే ట్రక్కులు, వ్యవసాయ యంత్రాలు, కోల్డ్ స్టోరేజ్ వ్యవస్థలు ప్రధానంగా డీజిల్‌పై ఆధారపడుతాయి. అదేవిధంగా గల్ఫ్ దేశాలు యూరియా వంటి ఎరువుల ప్రధాన ఎగుమతిదారులు కావడంతో హోర్ముజ్ సంక్షోభం ఎరువుల మార్కెట్‌పైనా ప్రభావం చూపింది. రవాణా, ఉత్పత్తి ఖర్చులు తగ్గితే కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరల్లో కూడా కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

ఎల్పీజీ సిలిండర్ల ధరలు:

భారత్ ఇప్పటికీ గృహ వినియోగ ఇంధన అవసరాల కోసం దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. హోర్ముజ్ జలసంధి సాధారణ స్థితికి రావడం, ఇరాన్ నుంచి చమురు సరఫరా పెరగడం వల్ల ఎల్పీజీ, సహజవాయువు మార్కెట్లపై ఒత్తిడి తగ్గవచ్చు. దాడుల సమయంలో పెరిగిన షిప్పింగ్ ఖర్చులు, బీమా ప్రీమియంలు తగ్గే అవకాశం ఉండటంతో దిగుమతి వ్యయం కూడా తగ్గుతుంది. దీంతో ప్రభుత్వం ఎల్పీజీ ధరలను స్థిరంగా ఉంచేందుకు మరింత అవకాశం లభించవచ్చు.

హోం లోన్లు, కార్ లోన్లు చౌక.?

ఈ ఒప్పందం వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనం ప్రత్యక్షంగా కనిపించకపోవచ్చు. చమురు ధరలు తగ్గితే రవాణా, తయారీ, ఆహార రంగాల్లో ఖర్చులు తగ్గి ద్రవ్యోల్బణం నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉంటుంది. ద్రవ్యోల్బణం తగ్గితే భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లపై సానుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో భవిష్యత్తులో హోం లోన్లు, కార్ లోన్లు, వ్యాపార రుణాలపై వడ్డీ భారం తగ్గే అవకాశం ఉంది.

భారత్‌కు ఎందుకు కీలకం.?

భారత్ దిగుమతి చేసుకునే ముడి చమురులో దాదాపు 60% ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా హోర్ముజ్ జలసంధి మార్గంపైనే ఆధారపడి ఉంటుంది. ఈ మార్గం మూసివేయబడితే చమురు సరఫరా అంతరాయం, ద్రవ్యోల్బణం పెరుగుదల, ప్రస్తుత ఖాతా లోటు వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. అందుకే అమెరికా, ఇరాన్ మధ్య కుదరనున్న ఈ శాంతి ఒప్పందం కేవలం ఒక దౌత్య విజయం మాత్రమే కాదు. ఇది భారతదేశానికి చౌకైన ఇంధనం, తగ్గిన ద్రవ్యోల్బణం, తక్కువ రవాణా వ్యయం, మరింత ఆర్థిక స్థిరత్వాన్ని అందించే అవకాశంగా కూడా కనిపిస్తోంది. భారతీయుల వంటగది నుంచి బ్యాంకు రుణాల వరకు ఈ ఒప్పందం ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# బిడ్డా జాగ్రత్త.. మావోయిస్టులందరూ మా పార్టీలోనే ఉన్నారు.. కవిత సెన్సేషనల్ కామెంట్స్




**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** మావోయిస్టులపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అడవిలో అన్నలు ఉంటే సింగరేణి అధికారులు పద్ధతిగా పని చేసేవారు. కానీ ఇప్పుడు అడవిలో అన్నలు లేరు కాబట్టి అడిగే దిక్కులేదని సింగరేణి యాజమాన్యం అనుకుంటోంది. కానీ అన్నలందరూ ఇప్పుడు మా పార్టీలోనే ఉన్నారని కవిత వ్యాఖ్యానించారు. బిడ్డా.. గుర్తుపెట్టుకోండి. కార్మికులకు ఇబ్బంది పెడితే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా కవిత మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్‌కే7 భూగర్భ గనివద్దకు వెళ్లిన కవిత అక్కడ కార్మికులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. అయితే అక్కడ కవితను సింగరేణి సిబ్బంది అడ్డుకోగా కవిత తన అనుచరులతో కలిసి గేట్లు తోసుకుని లోపలికి వెళ్లారు. ఈ సందర్భంగా సింగరేణి సిబ్బందికి, హెచ్ఎంఎస్ కార్మికులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

వేధింపులు ఆపాలి:

అనంతరం మాట్లాడిన కవిత మావోయిస్టులు మాతోనే ఉన్నారని కార్మికులను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. కార్మికులను వేదించడం ఆపాలన్నారు. లాభాల వాటాల్లోనూ ప్రతియేడాది కార్మికులకు సింగరేణి యాజమాన్యం నష్టం చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలోని మహిళా ఉద్యోగులకు సరైన సౌకర్యాలు లేవని ఇకనైనా ఈ సమస్యపై దృష్టి సారించాలన్నారు. సింగరేణిలో ఇప్పటికీ పాత టెక్నాలజీ వాడుతుండటం ఏంటని నిలదీశారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో అన్యాయం జరుగుతోందన్నారు. అండర్ గ్రౌండ్ మైనింగ్ విస్తరించాలని డిమాండ్ చేశారు.

ఇటీవలే దేవ్ జీని కలిసి కవిత:

మావోయిస్టులు మా పార్టీలోనే ఉన్నారంటూ కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారాయి. అయితే రెండు వారాల క్రితం మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీని కవిత పరామర్శించారు. దేవ్ జీ అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఈ విషయం తెలుసుకున్న కవిత.. ఆసుపత్రికి వెళ్లి ఆయనను స్వయంగా కలిసి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న దేవ్ జీ సుమారు 40 ఏళ్ల అజ్ఞాత జీవితానికి స్వస్తి పలికి కొన్ని నెలల క్రితమే పోలీసుల ఎదుట లొంగిపోవడం ద్వారా జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఆయనతో పాటు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ సైతం అజ్ఞాతం వీడారు. వీరంతా త్వరలోనే యాక్టివ్ పాలిటిక్స్ రాబోతున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కవిత చేసిన మావోయిస్టు వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# లీకేజీ డ్రామాలకు చెక్ టెలిగ్రామ్ నిషేదంపై ఎన్టీఏ వివరణ

మొదటి పేజీ తరువాయి





కొన్ని సైబర్ నేరగాళ్ల ముఠాలు, అనామక టెలిగ్రామ్ ఛానెళ్లు అభ్యర్థుల నుంచి ప్రశ్నపత్రాల లీకేజీ పేరుతో భారీగా డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు కేంద్ర నిఘా వర్గాలు, బీహార్, గుజరాత్, రాజస్థాన్ పోలీసులు గుర్తించడంతో ఈ కఠిన చర్యలు చేపట్టారు. పరీక్షల భద్రత దృష్ట్యా కేంద్రం తీసుకున్న ఈ సమయానుకూల నిర్ణయాన్ని ఎన్టీఏ పూర్తిగా స్వాగతించింది.

ఈ మోసాలతో పాటు, పరీక్ష ముగిసిన తర్వాత ప్రశ్నపత్రాన్ని అప్‌లోడ్ చేసి, మెసేజ్‌ను ఎడిట్ చేయడం ద్వారా పరీక్షకు ముందే పేపర్ లీక్ అయినట్లు తప్పుడు స్క్రీన్‌షాట్లు సృష్టించి పుకార్లు పుట్టిస్తున్నట్లు అధికారులు గమనించారు. ఈ 'మెసేజ్ ఎడిటింగ్' ఫీచర్ దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి, జూన్ 30 వరకు భారతదేశంలో ఈ ఫీచర్‌ను నిలిపివేయాలని కేంద్రం టెలిగ్రామ్ సంస్థను ఆదేశించింది. గుజరాత్‌లో రూ.1.5 కోట్ల మేర సైబర్ మోసానికి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను ఇప్పటికే అరెస్టు చేయగా, సీబీఐ కూడా దీనిపై విచారణ జరుపుతోంది. ఈ ఆంక్షల వల్ల సాధారణ వినియోగదారులకు కొంత ఇబ్బంది కలిగినప్పటికీ, పరీక్షల పారదర్శకతను కాపాడటానికి మరియు అభ్యర్థులు తప్పుడు పుకార్ల బారిన పడకుండా ఉండటానికి ఈ నిర్ణయం అనివార్యమైందని ఎన్టీఏ స్పష్టం చేసింది. జూన్ 21న పరీక్ష యథావిధిగా జరుగుతుందని, అభ్యర్థులు ఎలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించింది.

# తెలంగాణకు ఎండల ముప్పు ఉత్తర జిల్లాలకు 'హీట్ వేవ్' అలర్ట్

మొదటి పేజీ తరువాయి



జూన్ మధ్య మే నెల తరహాలోనే ఎండలు దంచికొడుతుండటంతో జన ఉక్కపోతతో, వడగాల్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరో 4 రోజుల్లో ఉపశమనం..

ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రుతుపవనాల కదలికలు నెమ్మదించాయని తెలిపారు. అందువల్లే రాష్ట్రంలో వర్షాలు కురవకుండా భారీగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే 4 రోజుల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. అప్పటి వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున మధ్యాహ్నం వేళల్లో ప్రజలు, వృద్ధులు బయటకు రావొద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# 'నీట్' అభ్యర్థులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్

మొదటి పేజీ తరువాయి




అలాగే ఎగ్జామ్ రోజు విద్యార్థులు ఎక్కడా ఇబ్బంది పడకుండా, సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో సాధారణ బస్సులతో పాటు అదనంగా ప్రత్యేక బస్సులను కూడా నడపనుంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారి విజయయాత్రకు తోడుగా నిలిచేందుకు ఏపీఎస్ఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయంపై అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల నుంచి హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే నీట్ రీ ఎగ్జామ్ సందర్భంగా టెలిగ్రామ్ పై కేంద్ర తాత్కాలిక నిషేధం విధించిన విషయం తెలిసిందే.

# బీఆర్ఎస్‌లో 'మావోయిస్టు' భావజాల నేతలున్నారు బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు




**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** 'సర్' ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కావాలనే రాజకీయం చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా ఉన్న ఓట్లను అధికారులు తొలగిస్తే అందులో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి, రాజకీయ పరిణామాలపై ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ విపక్షాలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓట్ల తొలగింపు వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని ముస్లిం సామాజిక వర్గంలో కాంగ్రెస్ పార్టీ లేనిపోని భయాలు కల్పిస్తోందని బండి సంజయ్ మండిపడ్డారు. కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే ముస్లింల మధ్య కాంగ్రెస్ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, సర్ ప్రక్రియను తప్పుబట్టడం వెనుక రాజకీయ స్వార్థం దాగి ఉందని విమర్శించారు.

మెట్రోపై రేవంత్ ఆరోపణల్లో నిజం లేదు..

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మెట్రో సెకండ్ ఫేజ్ (రెండో విడత) పనులను అడ్డుకుంటున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బండి సంజయ్ పూర్తిగా కొట్టిపారేశారు. ఈ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదన్నారు. తెలంగాణ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి భారీగా నిధులు అందుతున్నాయని, నిధుల కేటాయింపుల్లో ఎలాంటి వివక్ష లేదని ఆయన స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ 'మావోయిస్టు' భావజాలం..

ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీలో మావోయిస్టు భావజాలం ఉన్న నేతలు ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ఉగ్ర, తీవ్రవాద భావజాలం ఉన్న నాయకుల వల్ల సమాజానికి తీవ్ర ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజలు ఆలోచించాలని, బీఆర్ఎస్ లాంటి పార్టీలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు.

# గుర్తింపు కార్డుగా ఆధార్ వినియోగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు



**న్యూస్ డెస్క్,16 జూన్ (కెరటం న్యూస్):** దేశంలో ప్రతీపౌరుడు నేటివిటీ, బర్త్, వ్యక్తిగత గుర్తింపు కార్డుగా ఆధార్ కార్డును వాడుతున్న విషయం తెలిసిందే. ఆధార్ ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన కార్డుగా మారింది. అయితే యూఐడిఏఐ నుంచి పొందిన ఆధార్ కార్డుల్ని కొందరు పౌరసత్వం, స్థానికత, నివాస ధృవీకరణ పత్రాలుగా దుర్వినియోగం చేస్తున్నారని ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ పై ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. దీనిపై స్పందించాలని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం సహా.. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఆధార్ ను కేవలం ఒక వ్యక్తి గుర్తింపును ధృవీకరించే పత్రంగా మాత్రమే పరిగణించేలా స్పష్టమైన ఆదేశాలివ్వాలని పిటిషన్ కోరింది.


అడ్వకేట్ అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ఈ పిటిషన్ ను చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర ఎన్నికల సంఘం దీనిపై సమాధానాలను సమర్పించాలని ఆదేశిస్తూ.. ప్రస్తుతం కోర్టులో పెండింగ్ లో ఉన్న ఇతర కేసులతో దీనిని కూడా జతచేసింది. న్యాయవాది అశ్వినిదూబే ఈ పిటిషన్లో కీలక అంశాలను లేవనెత్తారు. ఆధార్ చట్టం 2016లోని సెక్షన్ 9 ప్రకారం ఆధార్ కార్డు అనేది పౌరసత్వానికి, స్థానికతకు ఎట్టిపరిస్థితుల్లోనూ సాక్ష్యం కాదన్నారు. ఆధార్ కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని యూఐడిఏఐ ఆగస్టు 22,2023 నాడు జారీ చేసిన నోటిఫికేషన్లో పేర్కొందన్నారు. ఈ నిబంధనలు ఉన్నప్పటికీ, పాఠశాల ప్రవేశాలు, ఆస్తుల కొనుగోళ్లు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం ఆధార్‌ను వాడుతున్నారన్నారు. చివరకు కొత్త ఓటరు నమోదు ఫారమ్–6 లో కూడా దీనిని పుట్టిన తేదీ, నివాస ధృవీకరణగా అంగీకరిస్తున్నారని పిటిషన్ లో పేర్కొన్నారు. చొరబాటుదారులు ఈ లొసుగులను వాడుకుని దేశంలోకి అక్రమంగా చొరబడి, ఆధార్ ను ఈజీగా పొంది ఇక్కడ స్థానికులుగా చలామణి అవుతూ దేశానికి ముప్పు తలపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వెంటనే కమిటీ ఏర్పాటు చేయాలి

ఓటరు నమోదు ప్రక్రియలో ప్రస్తుతం ఉన్న వెరిఫికేషన్ విధానం లోపభూయిష్టంగా ఉందని, సరైన ఆధారాలు లేనివారు సైతం ఓటరు జాబితాలోకి చేరే ప్రమాదం ఉందని దూబే పిటిషన్లో తెలిపారు. వెంటనే ఎన్నికల ప్రక్రియల్లో వెరిఫికేషన్ విధానాన్ని పునర్వ్యవస్థీకరించాలని, దీనిని పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి, సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోర్టును అభ్యర్థించారు.

# రైతులకు భారీ ఊరట నెలాఖరున రైతు భరోసా జమ

మొదటి పేజీ తరువాయి



సాయంపై కటాఫ్‌కు కసరత్తు

ఇప్పటివరకు పట్టా పాస్‌బుక్‌లో ఉన్న మొత్తం భూమికి సాయం అందించగా, ఇకపై ఐదు నుంచి ఏడున్నర ఎకరాల వరకు మాత్రమే పరిమితం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. రియల్ ఎస్టేట్, పడావు, బీడు భూములకు సైతం సాయం వెళ్లినట్లు గుర్తించిన వ్యవసాయ శాఖ.. వాటిని దశలవారీగా తొలగించేందుకు చర్యలు చేపడుతోంది. పెద్ద భూస్వాములకు సాయం అందించడం కంటే చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యేలు సూచిస్తున్నారు. ఇలా చేస్తే వారికి ఆర్థికంగా మద్దతు లభించడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని భావిస్తున్నారు.

యాసంగిలో పరిమిత సాయంపై విమర్శలు

యాసంగి సీజన్‌లో కేవలం రెండు ఎకరాలకే సాయం అందించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రైతు బంధు రెండు విడతలుగా సకాలంలో జమ అవగా, ప్రస్తుతం ఆలస్యం కావడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యేలు చెబుతున్నారు. గ్రామాల్లో రైతుల నుంచి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుందని భావించి కొంతమంది ప్రజాప్రతినిధులు వెనుకడుగు వేస్తున్నట్టు సమాచారం. పెండింగ్ రైతు భరోసా త్వరగా విడుదల చేస్తే రైతుల నుంచి మంచి స్పందన వస్తుందని, లేకపోతే భవిష్యత్ స్థానిక ఎన్నికల్లో పార్టీపై ప్రభావం పడే అవకాశం ఉందని పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సబ్ స్టేషన్ కొరకు వినతి



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీజీఈ హైట్స్ (తెలంగాణ ఉద్యోగుల మరియు పెన్షనర్ల హౌస్ బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ) కి 33/11 కెవిఎస్ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కొరకు జిల్లా కలెక్టర్ దివాకరా టిఎస్ ఐఏఎస్ ని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస్, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు కొండపల్లి శేషు ప్రసాద్, డాక్టర్ పి విజయ్ కుమార్ కలిసి సబ్ స్టేషన్ నిర్మాణానికీ స్థలం కేటాయించవలసిందిగా కోరడమైనది, దీనికై దివాకర్ టిఎస్ ఐఏఎస్ సాను కూలంగా స్పందించి త్వరలోనే సబ్ స్టేషన్ నిర్మాణానికి సహకరిస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాస్ టీజీఈ హైట్స్ యొక్క పనుల పురోగతిని కలెక్టర్ కి వివరించడం జరిగింది, 576 ఉద్యోగుల కుటుంబాల కు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగు తున్నాయని టిజిఈ హైట్స్ లో పార్కింగ్ కోసం మూడు బహుళ అంతస్తుల పార్కింగ్ ని ఏర్పాటు చేస్తున్నామని, సబ్ స్టేషన్ నిర్మాణం కొరకు ల్యాండ్ తక్కువగా ఉన్నందున రాజీవ్ స్వగృహ అపార్ట్మెంట్ పరిసర ప్రాంతంలోని ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయని వాటి నుండి ఒక ఎకరం ల్యాండ్ ని సబ్ స్టేషన్ నిర్మాణానికి కోరినట్లు వివరించారు. టీజీఈ హైట్స్ లో జరుగుతున్న పనుల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కోశాధికారి వెంకన్న పాల్గొన్నారు.

# నాగసాయికి అవార్డుల పంట



**వనం నాగయ్య, కెరటం న్యూస్:** ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ భక్తి గీతాల గాయకుడు, నాగసాయి ఎన్ఎస్పి రామగిరి రామాలయం వేదికగా 14 గంటలపాటు సుదీర్ఘంగా హనుమాన్ చాలీసా పారాయణం గానం చేసి రెండు అంతర్జాతీయ రికార్డ్స్ (విశ్వం వరల్డ్ రికార్డ్, గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ ) మరియు ఒక జాతీయ స్థాయి రికార్డ్ (ఆక్సిజన్ బుక్ ఆఫ్ నేషనల్) సాధించినట్లు కార్యక్రమ పర్యవేక్షణ, గౌరవాధ్యక్షులు ఎన్ఎస్పి రామగిరి రామాలయ ప్రధాన అర్చకులు సముద్రాల వెంకటనరసింహ చార్యులు తెలియజేశారు. గాయకుడు నాగసాయి కి సర్టిఫికెట్స్ ప్రధానం చేసిన మాజీ స్పీకర్ మధుసూదనాచారి, వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డ్స్ ఇండియన్ చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ తెలంగాణ చీఫ్ కోఆర్డినేటర్ వంజా మాలతి నాయుడు, మెగా రికార్డ్స్ క్రియేషన్స్ సంస్థ అధినేత పి.శ్రీనివాసరావు, తెలంగాణ శ్రీ అయ్యప్ప సేవార్థి ఐక్యవేదిక అధ్యక్షులు వాకటి భాస్కరరావు మరియు ప్రముఖుల చేతుల మీదుగా అందించడం జరిగింది. లోక కళ్యాణం కోసం, విశ్వక్షేమం కోరుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేకమంది హిందూ భగవద్ బంధువులు, హనుమాన్ భక్తులు, ఆధ్యాత్మిక సేవకులు, భక్తి గీతాల గాయకులు తదితరులు పాల్గొని నాగసాయి కి శుభాకాంక్షలు తెలియజేశారు .

# న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష




**ఖమ్మం లీగల్, కెరటం న్యూస్:** ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సమస్యలపై మంగళవారం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎడ్లపల్లి రమేష్,కొప్పుల రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణానికి బయట న్యాయవాద సమస్యలైన 1) 2019 నుంచి ఇప్పటివరకు జూనియర్ న్యాయవాదులకు హెల్త్ కార్డుల మంజూరు మరియు రెన్యువల్ కొరకు డిమాండ్ చేస్తూ 2) రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల, జీపీ, ఏజీపీ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ.....3)సె 35 అఫ్ బిఎన్ఎస్ఎస్ ( సె .41 అఫ్ సీ ఆర్ .పి .సి) సవరణ వంటి అంశాలపై ఒక్కరోజు నిరాహార దీక్ష నిర్వహించడం జరిగింది. గౌరవ సీనియర్ తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్స్ కొల్లి సత్యనారాయణ, మందడపు శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు ఏడునూతల శ్రీనివాసరావు, బిజ్జాల తిరుమలరావు, ఓరుగంటి శేషగిరి, తాళ్లూరి దిలీప్, దిరిశాల కృష్ణారావు,మల్లెంపాటి అప్పారావు,మామిడి హనుమంతరావు,మేకల సుగుణ రావు,సుగ్గాలా వెంకట్ గుప్తా, కంద వెంకటేశ్వరరావు, ఎస్కె జానీ మియా,మోజెస్ క్రిస్టఫర్,కోన వెంకట్ గుప్తా, పసుపులేటి శ్రీనివాసరావు, మాజీ బార్ ప్రెసిడెంట్ తొండపు, వెంకటేశ్వరరావు, గద్దల దిలీప్, ఎస్.కె మల్సూరు, మల్లె బోయిన వలరాజు, సింగం జనార్ధన్, విప్లవ కుమార్, కొలక నూరి ప్రసాద్,ధారావత్ రాందాస్ నాయక్, రంగారావు, కొప్పుల కిషోర్ అంబేద్కర్, మహిళ న్యాయవాదులు, మరియు జూనియర్ న్యాయవాదులు సభ్యులందరూ నిరాహార దీక్ష లో పాల్గొని విజయవంతం చేశారు.

# ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కమిటీ ఎన్నిక

**చింతకాని, కెరటం న్యూస్:** చింతకాని మండలంలోని రాఘవపురం గ్రామంలో కొండపర్తి గోవిందరావు బృందావన్ గార్డెన్‌లో జిల్లా ఇన్‌చార్జ్ అబ్బూరి ఉమామహేశ్వరరావు మరియు మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంబటి శరత్ కుమార్ అధ్యక్షతన చింతకాని మండలం ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గ ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా వంగూరి రమేష్ (గాంధీనగర్ కాలనీ), ఉపాధ్యక్షుడిగా చిట్టిమోదుల రాంబాబు (కొదుమూరు), ప్రధాన కార్యదర్శిగా కూచిపూడి బుచ్చిబాబు (తిమ్మినేనిపాలెం), సహాయ కార్యదర్శిగా శ్రీమతి తంగిరాల మాధవి (చిన్న మండవ) ఎన్నికయ్యారు.

కార్యవర్గ సభ్యులుగా పోట్ల సీతయ్య (లచ్చగూడెం), గోగుల నాగమణి (తిరుమల పురం), బండి రమేష్ (రైల్వే కాలనీ), దొడ్డ వీరబాబు (నర్సింహాపురం) చంద్రకాని నరసింహారావు (బస్వాపురం) ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దుకు సంబంధించిన వార్తలపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని, ఉప సర్పంచ్‌ల హక్కులు మరియు గౌరవాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 25న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

ఉప సర్పంచ్‌ల ప్రధాన డిమాండ్లు:

1. ఉప సర్పంచ్‌లకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం అందించాలి.
2. వార్డు సభ్యులకు నెలకు రూ.3,000 గౌరవ వేతనం ఇవ్వాలి.
3. గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్‌లకు ప్రత్యేకంగా కుర్చీ మరియు టేబుల్ ఏర్పాటు చేయాలి.
4. చెక్ పవర్ రద్దుపై వస్తున్న వార్తలను ఖండిస్తూ ప్రభుత్వం అధికారిక ప్రెస్ నోట్ విడుదల చేయాలి.
5. ప్రభుత్వ పనుల ప్రారంభ శిలాఫలకాలపై ఉప సర్పంచ్ పేరు తప్పనిసరిగా










పొందుపరచాలి.

6. ఉప సర్పంచ్‌ల ఆత్మగౌరవం మరియు రాజ్యాంగబద్ధమైన హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

# భట్టి విక్రమార్క బర్త్ డే సక్సెస్ చేసిన వారందరికీ కృతజ్ఞతలు

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అలాగే ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, భట్టి విక్రమార్క జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించిన సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు మరియు శుభాకాంక్షల కార్యక్రమాలు విజయవంతం కావడానికి అందరి సహకారం ఎంతో కీలకమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే జన్మదిన వేడుకలకు విస్తృత ప్రచారం కల్పించిన పత్రికా రంగం మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. భట్టి విక్రమార్క ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడని, ఆయన ఆశయాల సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పేర్కొన్నారు.

# సుడా చైర్మన్, కలెక్టర్ తో మర్యాదపూర్వక భేటీ



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌ను సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుడా పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్‌కు అందజేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజలకు మరింత మెరుగైన సేవల అందింపు, అభివృద్ధి కార్యక్రమాల అమలు వేగవంతం చేయడం వంటి అంశాలపై చర్చించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి ప్రాంత సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణుల నరకయాతన



**సిద్దిపేట కెరటం న్యూస్:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది మంది గర్భిణీలు వైద్య పరీక్షల (చెకప్‌ల) కోసం ఆసుపత్రికి వస్తున్నప్పటికీ, వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆసుపత్రి యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూర్చోవడానికి కుర్చీలు, బెంచీలు లేకపోవడంతో గర్భిణీలు గంటల తరబడి నేలపైనే కూర్చొని తమ వంతు కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజూ వందలాది మంది గర్భిణీలు వైద్య పరీక్షల కోసం వస్తుంటారు.

అయితే, ఓపీ విభాగం వద్ద గర్భిణీలు కూర్చోవడానికి కనీసం కుర్చీలు లేదా బెంచీలు కూడా అందుబాటులో లేకపోవడంతో, నెలలు నిండిన గర్భిణీలు నేలపైనే కూర్చొని గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఓపీ లైన్‌లో ఎక్కువసేపు నిలబడలేక, కూర్చోవడానికి కూడా స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి పై గర్భిణీల బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గర్భిణీలు ఇంతగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఆసుపత్రి సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రిలో కుర్చీలు, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలను కల్పించి గర్భిణీలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# సుడా చైర్మన్ పువ్వాళ్ళ సన్మాన కార్యక్రమం జయప్రదం చేయండి

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ నేడు ది17-06-2026 న బుధవారం ఉదయం 10.00 గంటలకు వైరా పట్టణంలోని కమ్మ వారి కల్యాణ మండపం నందు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సుడా చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సన్మాన కార్యక్రమం కలదు కావున జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అందరు సకాలంలో విచ్చేసి కార్యక్రమమును జయప్రదం చేయగలరని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పత్రికాముఖంగా కోరినారు.

# అంగనవాడి కేంద్రాలకు నష్టం చేసే చర్యలు మానుకోవాలి..సిఐటియు డిమాండ్



**ఖమ్మం రూరల్, కెరటం న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో 70 వేల మంది టీచర్లు హెల్పర్లు గత 50 సంవత్సరాల నుండి పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని బడుగు బలహీన వర్గాల సంబంధించిన వారే అత్యధికలుగా నేటికీ పనిచేస్తున్నారని వారికి ఎలాంటి చట్టబద్ధత లేదని అనేక ఇబ్బందులు పడుతున్నారని కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదని సమస్యలతో ఇబ్బందులు పడుతున్న అంగన్వాడీ టీచర్లు హెల్పర్లకు నష్టం చేసే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని దీనిని వెంటనే వెనక్కి తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ పల్లి మోహన్ రావు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

అంగనవాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుల భాగంగా ఖమ్మం రూరల్ మండలంలో పలు గ్రామాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు ఈ సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఖమ్మం రూరల్ ప్రాజెక్ట్ కార్యదర్శి సిహెచ్ పుష్పావతి ఉపాధ్యక్షులు రాధా లక్ష్మి భాగ్యమ్మ జిల్లా కమిటీ సభ్యులు కాంత లక్ష్మి అరుణ నాగేంద్రమ్మ యాదమ్మ సరిత సుజాత రజిత పోరాటానికి మద్దతుగా గ్రామపంచాయతీ ఆశ మధ్యాహ్నం భోజన వర్కర్స్ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ చేస్తున్న పోరాటానికి సంపూర్ణ సంఘీభావ మద్దతు ప్రకటించారు వారిలో ఆశా వర్కర్స్ సుజాత తిరపమ్మ మధ్యాహ్నం వర్కర్లు స్వప్న ధనలక్ష్మి నరసయ్య తదితరులు పాల్గొన్నారు. నిరసన కార్యక్రమం ఆరెంపుల చింతపల్లి యం వి పాలెం గోళ్ళపాడు పోలేపల్లి తీర్థాల మంగళగూడెం గ్రామాలలో నిర్వహించారు.

# దుస్తులు ఉతికేందుకు వెళ్లిన యువతి

## చెరువులో పడి మృతి..



**గంభీరావుపేట కెరటం న్యూస్:** ప్రమాదవశాత్తు చెరువులో పడి యువతి మృతి చెందిన ఘటన మంగళవారం గంభీరావుపేట మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు... రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని భీముని మల్లారెడ్డి పేట గ్రామానికి చెందిన బంటు జ్యోతి(25) ఊరి పక్కన ఉన్న చెరువు వద్దకు దుస్తులు ఉతికేందుకు వెళ్లింది. అక్కడ దుస్తులు ఉతుకుతూ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. ఎంతసేపటికీ జ్యోతి బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు చెరువు వద్దకు చేరుకొని గాలించారు. చెరువులో యువతి మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేను ఎవరికీ నీతులు చెప్పడానికి ఇక్కడ రాలేదు..తిలక్ వర్మ సంచలన వ్యాఖ్యలు!




స్పోర్ట్స్ న్యూస్,16 జూన్ (కెరటం న్యూస్): ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఇండియా-ఎ, శ్రీలంక-ఎ జట్ల మధ్య సోమవారం దంబుల్లా వేదికగా జరిగిన మ్యాచ్ అనంతరం చోటుచేసుకున్న వివాదం మరింత ముదురుతోంది. సూపర్ ఓవర్‌లో శ్రీలంక విజయం సాధించిన అనంతరం భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ, శ్రీలంక ఆటగాడు విశెన్ హలంబగే మధ్య జరిగిన వాగ్వాదం జరిగింది. కాసేపైతే ఇద్దరు మైదానంలోనే కొట్టుకునేవారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఘటనపై భారత జట్టు కెప్టెన్ తిలక్ వర్మ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశాడు.

**శ్రీలంక ఆటగాళ్ల ప్రవర్తన నచ్చలేదు:**

మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో తిలక్ వర్మ మాట్లాడుతూ.. 'నేను ఎవరికీ ఉపన్యాసాలు ఇవ్వడానికి ఇక్కడ లేను. కానీ 15 ఏళ్ల చిన్న వయసున్న వైభవ్ సూర్యవంశీతో శ్రీలంక ఆటగాళ్లు వ్యవహరించిన తీరు నాకు అస్సలు నచ్చలేదు. అసలు అక్కడ ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. కానీ ఒక విషయం మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. మ్యాచ్ ముగిసిన తర్వాత వైభవ్ ప్రశాంతంగా వెళ్తున్నాడు. ఆ సమయంలో శ్రీలంక ఆటగాళ్లే అతడితో గొడవకు ప్రయత్నించారు. ఇది క్రికెట్‌కు అస్సలు మంచిది కాదు. భారత్-శ్రీలంక క్రీడా సంబంధాలకు కూడా ఇలాంటి సంఘటనలు మంచివి కావు' అని తిలక్ ఫైర్ అయ్యాడు.

**పూర్తి సంతోషంగా ఉన్నా:**

'ఈ మ్యాచ్ కూడా చివరి వరకు హోరాహోరీగా సాగింది. కానీ దురదృష్టవశాత్తు మేము సూపర్ ఓవర్‌లో ఓడిపోయాము. సూర్యాన్ష్, విప్రజ్ మధ్య భాగస్వామ్యం అద్భుతం. ఒత్తిడిలో కూడా వారు చాలా బాగా ఆడారు. మొత్తంగా మా బౌలింగ్ బాగుంది. స్పిన్నర్లు అద్భుతంగా రాణించారు. అర్షద్ ఖాన్ డెత్ ఓవర్లలో చక్కగా బౌలింగ్ చేశాడు. మా బౌలర్లు మ్యాచ్ చివరి బంతి వరకు తీసుకెళ్లారు. మా ప్రదర్శనపై పూర్తి సంతోషంగా ఉన్నాను' అని తిలక్ వర్మ చెప్పుకొచ్చాడు.

**ఉత్కంఠగా సాగిన మ్యాచ్:**

రంగిరి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ అభిమానులకు అసలైన థ్రిల్లర్‌ను అందించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇండియా-ఎ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక-ఎ కూడా 50 ఓవర్లలో 265/9 స్కోరు చేయడంతో మ్యాచ్ టైగా ముగిసింది. దీంతో విజేతను నిర్ణయించేందుకు సూపర్ ఓవర్ నిర్వహించారు. సూపర్ ఓవర్‌లో శ్రీలంక 16 పరుగులు చేయగా.. భారత జట్టు 10 పరుగులకే పరిమితమైంది. దీంతో లంక 7 పరుగుల తేడాతో విజయం సాధించింది.

**సూపర్ ఓవర్‌లో కూడా వివాదం:**

సూపర్ ఓవర్ సందర్భంగా కూడా భారీ డ్రామా చోటుచేసుకుంది. తొలుత శ్రీలంక ఇన్నింగ్స్ ముగిసినట్లు భావించిన భారత ఆటగాళ్లు మైదానం వీడారు. అయితే అంపైర్లు చివరి బంతిని నోబాల్‌గా ప్రకటించి మరో బంతి వేయాలని సూచించడంతో కెప్టెన్ తిలక్ వర్మ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. భారత ఆటగాళ్లు, అంపైర్ల మధ్య కొంతసేపు వాగ్వాదం కూడా జరిగింది. అదనపు బంతి తర్వాత శ్రీలంక స్కోరు 16 పరుగులకు చేరగా.. భారత్ లక్ష్యాన్ని ఛేదించలేక ఓటమి పాలైంది.

**వైరల్‌గా మారిన వైభవ్-లంక ప్లేయర్ ఘర్షణ:**

మ్యాచ్ ముగిసిన వెంటనే వైభవ్ సూర్యవంశీ, శ్రీలంక ఆటగాడు విశెన్ హలంబగే మధ్య మాటామాటా పెరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరు జట్ల ఆటగాళ్లు జోక్యం చేసుకుని వారిని విడదీశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. తిలక్ వర్మ చేసిన తాజా వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్ రిఫరీ ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




## 'కల్కి-2' సినిమాలో ఆలియా భట్



రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న చిత్రాల్లో 'కల్కి-2' ఒకటి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ 'కల్కి'కి సీక్వెల్‌గా రాబోతుండటంతో డార్లింగ్ అభిమానులతో పాటు, సినీ సెలబ్రిటీల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. గత కొద్దికాలంగా 'కల్కి-2' మూవీకి సంబంధించి సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఇందులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు కొద్ది రోజుల నుంచి ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో ఓ ఆసక్తికరమైన అప్డేట్ బయటకు వచ్చింది. తాజా సమాచారం ప్రకారం.. కల్కి 2'లో అలియా భట్ నటించడం దాదాపు ఖాయమైందని టాక్.

గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా రెండవ షెడ్యూల్‌లో అలియా భట్ స్వయంగా పాల్గొన్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. అక్కడ ఆమెపై దాదాపు ఐదు రోజుల పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రబృందం సైలెంట్‌గా చిత్రీకరించిందని టాక్. ఈ సినిమాలో ఆమె క్యారెక్టర్ చాలా పవర్‌ఫుల్‌గా, కథను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లే విధంగా ఉండబోతోందని తెలుస్తోంది.. అయితే, మొదట్లో ఈ చిత్రంలో దీపికా పదుకోణె స్థానంలో సుమతి పాత్ర కోసం ఆలియా భట్‌ను అనుకుంటున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ.. తాజా లీకుల ప్రకారం ఆమె సుమతి పాత్ర చేయడం లేదని తెలుస్తోంది. ఆలియా భట్ కోసం దర్శకుడు నాగ్ అశ్విన్ అత్యంత కీలకమైన ఒక ప్రత్యేక పాత్రను డిజైన్ చేశారట. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ.. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు మాత్రం నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. దీనిపై అధికారిక విడుదల కావాల్సి ఉంది.

## బుచ్చిబాబుకు నో

ప్రిన్స్ మహేష్ బాబు ప్రస్తుతం జక్కన్న దర్శకత్వంలో వారణాసి సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా రేంజ్ లో వస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్ లో రిలీజ్ కానుంది. ఇలాంటి క్రమంలో మహేష్ బాబు తన నెక్స్ట్ సినిమాపై ఫోకస్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్స్ లో చర్చ మొదలైంది. యానిమల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో మహేష్ బాబు సినిమా దాదాపు ఫైనల్ అయినట్లు టాక్ వినిపిస్తోంది.

ప్రస్తుతం స్పిరిట్ షూటింగ్ లో సందీప్ రెడ్డి బిజీగా ఉన్నాడు. ఈ సినిమా ఫినిష్ కాగానే... మహేష్ తో సినిమాను పట్టాలెక్కించనున్నాడట. ఆ సమయానికి వారణాసి షూటింగ్ కూడా పూర్తి అవుతుందని అంటున్నారు. మహేష్ బాబు, సందీప్ రెడ్డి సినిమాకు ఏషియన్ సినిమా సునీల్ నారంగ్ నిర్మాతగా ఉండనున్నట్లు టాక్ నడుస్తోంది. కాగా.. బుచ్చిబాబుతో మహేష్ బాబు సినిమా ఉంటుందని మొన్నటి వరకు ప్రచారం జరిగింది. ఇక ఈ మూవీ ప్రచారంగానే ఉండనున్నట్లు టాక్ నడుస్తోంది.





## రెమ్యూనరేషన్ తగ్గించుకున్న స్టార్ హీరో !

స్టార్ హీరో విక్రమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో విభిన్న కథలతో ప్రేక్షకులను అలరించిన హీరో విక్రమ్.. షాకింగ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తన రెమ్యూనేషన్ భారీగా తగ్గించుకున్నారట. అంతేకాదు, సినీ నిర్మాతలపై భారం తగ్గించడానికి ప్రాఫిట్ షేరింగ్ మోడల్ ఎంచుకున్నట్లు కూడా టాక్ నడుస్తోంది. గతంలో ఒక్కో సినిమాకు రూ.35 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకునేవాడట. ఇదే అతని కెరీర్ లో గరిష్టమని తెలుస్తోంది. అయితే ఆ రెమ్యూనరేషన్ ను ఇప్పుడు రూ.20 కోట్లకు తగ్గించుకున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఆనంద్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న సినిమా నుంచి తక్కువ ఛార్జ్ చేయనున్నాడట. ఇక ఈ సినిమా ఈ ఏడాది చివరలో లేదా 2027 ప్రారంభంలో రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. కాగా హీరో అజిత్ కూడా తన రెమ్యూనరేషన్ తగ్గించుకున్నట్లు తెలుస్తోంది.